


## నూతన జోనల్ కమిషనర్‌ను అభినందించిన బండి రమేష్

**కూకట్ పల్లి, మే 4, (జనం వార్త) :** కూకట్ పల్లి జోనల్ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన మయాంక్ సింగ్ ను పిసిసి ఉపాధ్యక్షులు కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్ ఛార్జ్ బండి రమేష్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బండి రమేష్ నూతన జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్‌కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛలతో ఘనంగా సన్మానించి, అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ నూతన జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్ నేతృత్వంలో కూకట్‌పల్లి జోన్ ప్రజా సమస్యల పరిష్కారంలో మరింత ముందుంటుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగిరెడ్డి, తూము వేణు,గాలి బాలాజీ, కొప్పిశెట్టి దినేష్ ,తూము సంతోష్ , లక్ష్మయ్య, నారాయణ, రంగమోహన్, సాయి తులసి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ పాఠశాలలే నాణ్యమైన విద్యకు నిలయం

### తిమ్మాపూర్ మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షురాలు, పొన్నం సునీత అనిల్ గౌడ్

**మానకొండూర్, మే 4:** ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతోందని, వసతులు మెరుగుపడటంతో పాటు నిష్ణాతులైన ఉపాధ్యాయులు బోధన అందిస్తున్నారని కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షురాలు, మన్నెంపల్లి సర్పంచ్ పొన్నం సునీత అనిల్ గౌడ్ అన్నారు. సోమవారం మన్నెంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 2025--26 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఈ సందర్భంగా సన్మానించారు. 500కు పైగా మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులకు సునీత అనిల్ గౌడ్ జ్ఞాపికలు అందజేసి అభినందించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన ప్రధానోపాధ్యాయులు కె.మోహన్‌రావు, ఉపాధ్యాయ బృందాన్ని ఆమె అభినందించారు. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యాభ్యాసం, భవిష్యత్ ప్రగతికి పాఠశాల పూర్తి బాధ్యత వహిస్తుందని తెలిపారు. ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బూడిద కిషోర్, మాజీ ఉపసర్పంచ్ పొన్నం అనిల్ గౌడ్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## గ్రామీణ విద్యార్థులకు వాలీబాల్ శిక్షణ శిబిరం ప్రారంభం

**మానకొండూర్, మే 4:** గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా కేశవపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరానికి సోమవారం శ్రీకారం చుట్టారు. పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని వ్యాయామ ఉపాధ్యాయుడు భక్తు రాజకుమార్ ప్రారంభించి, క్రీడాకారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు కేవలం వినోదం మాత్రమే కాకుండా విద్యార్థుల్లో క్రమశిక్షణ, శారీరక దృఢత్వం, మానసిక వికాసాన్ని పెంపొందించే ముఖ్యమైన సాధనమని పేర్కొన్నారు. 14 ఏళ్లలోపు బాలబాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇలాంటి శిక్షణ శిబిరాల ద్వారా విద్యార్థుల ప్రతిభకు పదును పెట్టి, వారిని రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు సిద్ధం చేయవచ్చని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు వెంటనే పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.




## ఏ క్రతువు ఆచరించాలన్న ఉపనయనం తప్పనిసరి

### కుర్తాళా పీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతి స్వామి

**రంగారెడ్డి ప్రతినిధి, మే 4 :** శాస్త్రంలో చెప్పబడిన ఏ సంస్కారాలైనా క్రతువులు కానీ ఆచరించాలన్న ఉపనయనమై ఉండాలని కుర్తాళా పీఠం ఉత్తరాధికారి దత్తతేశ్వర నంద భారతి స్వామి అన్నారు. తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య గ్రేటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో దత్తతేశ్వర నంద భారతీ స్వామి సమక్షంలో రాష్ట్రస్థాయి బ్రాహ్మణ ఉచిత సామూహిక ఉపనయన మహోత్సవం అలకా పురి కాలనీ పార్క్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దత్తశ్వరానంద భారతి స్వామి అనుగ్రహ భాషణం చేశారు. బ్రాహ్మణుడు అనిపించుకోవాలంటే అది ఉపనయన సంస్కారంతోనే సాధ్యం అన్నారు. సమాఖ్య అధ్యక్షులు మునిపల్లి శ్రీనివాస అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంధ్యావందనం శిక్షణ సమితి అధ్యక్షులు కల్వకొలన శ్రీరామచంద్రమూర్తి, బాస్ కోఆర్డినేటర్, బసవరాజు శ్రీనివాస్, అలకాపురి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు వారణాసి వంశీ, బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య చైర్మన్ వెన్నంపల్లి జగన్మోహన్ శర్మ, భాస్కర మూర్తి, వక్క లంక శ్రీనివాసరావు, రఘునందన్, నాగరాజు, పవన్ కుమార్, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

# నేడు శ్రీకోట మైసమ్మకు బోనాలు

### ఘనంగా అమ్మవారి అలంకరణ



**నాగారం, మే 04 (జనం వార్త) :** శ్రీకోట మైసమ్మ విగ్రహ ప్రాణప్రతిష్ట మహోత్సవంలో భాగంగా సోమవారం శ్రీ శివకార్తీక్ శాస్త్రి ఆధ్వర్యంలో అమ్మవారికి క్షీరాభిషేకం చేసి పువ్వులతో అమ్మవారిని ఘనంగా అలంకరించారు. ఈ శుభ సందర్భంగా శ్రీకోట మైసమ్మ దయతో పట్టణ ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆలయ నిర్మాణ దాత గూడూరు పెంటయ్య గౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పలువురు నాయకులు,భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.నేడు కోట మైసమ్మ తల్లికి భక్తులు బోనాలు సమర్పించి,అమ్మవారి సన్నిధిలో అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందుకోవాలని గూడూరు పెంటయ్య గౌడ్ కుటుంబ సభ్యులు కోరారు.



## మహిళా సంఘాల బలోపేతానికి వీవో భవనాలు

### ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

**మానకొండూర్, మే 4:** కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలోని ముత్తారం, ధర్మారం, ఆముదాలపల్లి గ్రామాల్లో నిర్మించనున్న వీవో భవనాలకు సోమవారం మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ భూమిపూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటోందన్నారు. వీవో భవనాల ద్వారా మహిళా సంఘాలకు స్థిర వేదిక కలుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి గడువులోపు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ముత్తారం సర్పంచ్ మారవేణి రాజయ్య, ధర్మారం సర్పంచ్ చింతిరెడ్డి పద్మ, ఆముదాలపల్లి సర్పంచ్ తాళ్లపల్లి మొగిలి, మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోపగోని బస్వయ్యగౌడ్, ఏఎంసీ



వైస్ చైర్మన్ నాంపెల్లి తిరుపతి, జిల్లా కార్యదర్శి గట్టు తిరుపతి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ సోమవారం ప్రారంభించారు. వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చేందుకు అంబలి కేంద్రాలు అవసరమని పేర్కొంటూ, ఇలాంటి సేవా కార్యక్రమాలకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్రాన్ని ఏర్పాటు చేసిన మోరె గణేశ్‌ను ఎమ్మెల్యే అభినందించారు.

## కరీంనగర్ దాడి ఘటనపై ప్రభుత్వం విఫలం: కేటీఆర్

**కరీంనగర్, మే 4:** కరీంనగర్‌లో జరిగిన తాజా దాడి ఘటనపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. సోమవారం కరీంనగర్‌లోని పీఎంజే జ్యువెలర్స్‌ను పరిశీలించిన అనంతరం, దుండగుల దాడిలో గాయపడిన బాధితులను ఆస్పత్రిలో పరామర్శించిన ఆయన, స్థానిక ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, కరీంనగర్‌లో జరిగిన ఈ ఘటన దుర్మార్గమైనదని, దురదృష్టకరమని పేర్కొన్నారు. సంఘటన జరిగి 32 గంటలు గడిచినా ఒక్కరినీ అరెస్ట్ చేయలేకపోవడం పోలీసుల వైఫల్యాన్ని సూచిస్తుందని అన్నారు. ఈ ఘటనతో కరీంనగర్ ప్రజలు భయాందోళనలకు గురయ్యారని తెలిపారు. పట్టపగలే దుండగులు నగల దుకాణంలోకి చొరబడి దోపిడీకి పాల్పడడం రాష్ట్రంలో భద్రతా లోపాలను బహిర్గతం చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. కాల్పుల్లో ప్రాణాలు పోయాయేమోనని భయపడి దుండగులు పారిపోయారే గానీ, పోలీసుల భయంతో కాదని అన్నారు. దాదాపు నాలుగైదు కోట్ల రూపాయల విలువైన ఆభరణాలు దోచుకెళ్లారని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ పాలనలో శాంతి భద్రతలకు ప్రాధాన్యం ఇచ్చి తెలంగాణను దేశంలో అగ్రస్థానంలో నిలిపామని, పోలీసులకు ఆధునిక వాహనాలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. ప్రస్తుతం మాత్రం రాష్ట్రంలో పరిస్థితులు దిగజారిపోయాయని, కాంగ్రెస్ పాలనలో పోలీసులు పట్ల భయం లేకుండా పోయిందని విమర్శించారు. రాష్ట్ర హోంశాఖ సీఎం చేతిలోనే ఉండగా, ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ఆందోళనకరమని



కేటీఆర్ అన్నారు. గతంలో జరిగిన చందానగర్, కోటి ఘటనలను కూడా ప్రస్తావిస్తూ, నేరస్తులపై కఠిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కరీంనగర్‌ను సేఫ్ సిటీగా తీర్చిదిద్దేందుకు గతంలో చేపట్టిన చర్యలను గుర్తు చేస్తూ, ప్రస్తుతం ఆ వ్యవస్థలు సక్రమంగా పనిచేయడం లేదని అన్నారు. పోలీసులు వెంటనే నాకాబందీ చేపట్టి నిందితులను పట్టుకోవాల్సిందని, కానీ అలాంటి చర్యలు కనిపించడం లేదని విమర్శించారు. ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని, రాజకీయ కక్షలతో వ్యవహరిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. సీఎం ఇప్పటికైనా మేలుకుని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అక్రిడిటేషన్లలో అక్రమాల ఆరోపణలు

### సమగ్ర విచారణ కోరిన జర్నలిస్టులు

**ఖమ్మం, మే 4:** ఖమ్మం జిల్లాలో 2026--28 కాలానికి జర్నలిస్టుల మీడియా అక్రిడిటేషన్ ప్రక్రియపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో, సమగ్ర విచారణ చేపట్టాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజే ఎఫ్) జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్‌ను కోరింది. జిల్లా అధ్యక్షుడు నానబాల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి అర్వపల్లి నగేష్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించింది. ఫెడరేషన్ ప్రతినిధులు పేర్కొన్న ప్రకారం, అక్రిడిటేషన్ కమిటీ సభ్యుల నియామకంలో పారదర్శకత పాటించలేదని, అన్ని జర్నలిస్టు సంఘాలకు సముచిత ప్రాతినిధ్యం ఇవ్వకుండా ఒకే యూనియన్‌కు ప్రాధాన్యత కల్పించినట్లు ఆరోపించారు. కమిటీ నియామకం గోప్యంగా నిర్వహించబడిందని, ముందస్తు సమాచారం లేకుండా తీసుకున్న నిర్ణయాలు జర్నలిస్టు వర్గాల్లో అనుమానాలకు తావిస్తున్నాయని తెలిపారు. అలాగే, అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియలోనూ తీవ్ర అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. ఆన్లైన్‌లో వచ్చిన దరఖాస్తుల పరిశీలనలో ప్రభుత్వ జీవో నెం.252లో పేర్కొన్న ప్రమాణాలు పాటించకుండా, సర్క్యులేషన్, నియామక పత్రాలు, అనుభవ ధృవీకరణ వంటి కీలక పత్రాలను సమగ్రంగా పరిశీలించలేదని పేర్కొన్నారు. ఫీల్డ్ అనుభవం లేని వారికీ కార్డులు మంజూరు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయని, దీనివల్ల నిజంగా క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న జర్నలిస్టులకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.



## పీఎంజే ఘటనపై రాజకీయ రగడ

### బాధితులను పరామర్శించిన ఆది శ్రీనివాస్

**కరీంనగర్, మే 4:** కరీంనగర్ జిల్లాలో పీఎంజే జ్యువెలరీ షాపులో జరిగిన చోరీ, కాల్పుల ఘటనపై రాజకీయ వేడి పెరిగింది. ఘటన స్థలాన్ని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సందర్శించి బాధితులను పరామర్శించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డా. మేడిపల్లి సత్యం, రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ... పీఎంజే జ్యువెలరీ షాపులో దుండగులు జరిపిన కాల్పుల్లో సిబ్బంది గాయపడటం దురదృష్టకరమన్నారు. గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నామని, అవసరమైతే హైదరాబాద్‌కు తరలించి మెరుగైన వైద్యం అందిస్తామని తెలిపారు. దొంగలను ఎదిరించిన సిబ్బందికి మనోధైర్యం కల్పించాల్సింది పోయి బీఆర్ఎస్ నేతలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్ రెడ్డి రాజకీయ విమర్శలు చేయడం సరికాదన్నారు. పోలీస్ శాఖ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో గుండాటి శ్రీనివాస్ రెడ్డి, కొరివి అరుణ్ కుమార్, పులి కృష్ణ, కుంభాల రాజు కుమార్, జీడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## బిజెపి ఘన విజయానికి సంబరాలు

**రంగారెడ్డి ప్రతినిధి, మే 4 :** బెంగాల్,అస్సాం, పుదుచ్చేరి, లలో ఎన్నికల ఫలితాలు వెలువడిన నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గం లోని బాలాపూర్ చౌరస్తాలో భారతీయ జనతా పార్టీ మాజీ కార్పొరేటర్ ఎడ్ల మల్లేష్ ముదిరాజు ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ బెంగాల్ అస్సాం పుదుచెర్లలో ఘనవిజయం సాధించిన నేపథ్యంలో తమిళనాడులో సనాతన ధర్మ ద్రోహు డీఎంకే పార్టీ ఓటమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం జరిగిందని, బిజెపి కోఆపరేటివ్ సెల్ కన్వీనర్ కొలను శంకర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంచుతూ బిజెపి జిందాబాద్ జై మోడీ అంటూ టపాకాయలు కాల్చడం జరిగింది ఈ సందర్భంగా రాష్ట్ర బిజెపి కోపరేటివ్ సెల్ కన్వీనర్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశ ప్రజలు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారని వారిపై పూర్తి విశ్వాసంతో ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నేతలు మాజీ కార్పొరేటర్ కిషోర్, జిల్లెల్ల ప్రభాకర్ రెడ్డి, శశిధర్, భూషణం, దాసు, విజయ్ కుమార్, జి అరుణ, జి సూర్యప్రకాష్ సింగ్ జయ కాంతా రాఘవేంద్ర రాజేష్ రెడ్డి ఎస్ భాస్కర్ భూమన తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి ఉత్తీర్ణైన విద్యార్థులకు సన్మానం

**రంగారెడ్డి ప్రతినిధి, మే 4 :** బడంగ్ పేట సర్కిల్లోని సరస్వతి శిశు మందిర్ లో 2025 –26 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన 500 పై మార్పులు పొందిన 14 మంది విద్యార్థులను వారి తల్లిదండ్రుల సమక్షంలో పాఠశాల కమిటీ ఆదివారం ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు సామా సంఘీవరెడ్డి పాఠశాల కార్యదర్శి దొడ్డి మల్లికార్జున్ సహాయ కార్యదర్శి రామిడి శూరకర్ణ రెడ్డి ట్రెజరర్ కందికంటి గణేష్ గౌడ్ కిరణ్ గౌడ్ చిత్రం శ్రీనివాస్ పద్మావతి సురేష్ నరసింహ గౌడ్ ప్రధానాచార్యులు శేఖర్ రెడ్డి విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

